క్లుప్తంగా

## వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మధిర: మధిర పట్టణంలోని సీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైజింగ్ అనే కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు డ్రాయింగ్, క్యారమ్ బోర్డు, వాలీబాల్, డాన్స్ తదితర అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు మంత్రి తుమ్మల పర్యటన

సత్తుపల్లి: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా యాతాలకుంట టన్నెల్, సీతారామ ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలిస్తారు. అనంతరం యాతాలకుంటలో సమీక్ష నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

**గ్రామాల్లో దయానంద్ పర్యటన..**

తల్లాడ: మండలంలోని వెంగన్నపేట, నూతనకల్ గ్రామాల్లో గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పర్యటించారు. వెంగన్నపేటలో ఇటీవల మృతి చెందిన దొడ్డా నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, అనంద్ బాబు, రామకృష్ణ, ప్రభాకర్‌రావు, రవి, వెంకటయ్య, భూక్యా అంజయ్య పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మధిర/బోనకల్: పొలాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో పాడిగేదె మృతి చెందింది. మధిర మండలంలోని మల్లారానికి చెందిన రైతు మందడపు అర్జున్‌రావుకు సంబంధించిన గేదె గురువారం బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి సమీపాన పొలాల్లో మేస్తోంది. ఈక్రమాన ఇటీవల గాలిదుమారానికి కిందకు జారిన తీగలను గేదె తాకగా విద్యుదాఘాతంతో మృతి చెందింది. రూ.లక్ష విలువైన గేదె మృతి చెందినందున పరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరాడు.

# కమ్మేస్తున్న.. కాలుష్యం !

- ఊళ్లను చుట్టేస్తున్న సింగరేణి దుమ్మూధూళి
- బొగ్గు రవాణాతో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని సింగరేణి యాజమాన్యం



కిష్టారం ప్రజల కాలుష్యానికి కారణమవుతున్న సైలోబంకర్





సత్తుపల్లి - రేజర్ల రహదారిలో బాంబ్‌బ్లాస్టింగ్‌తో పెద్ద ఎత్తున వస్తున్న పొగ, దుమ్మూధూళి

**చుట్టూ అటవీ ప్రాంతం.. మామిడితోటలు.. చెట్ల గాలితో ఎంతో ప్రశాంతమైన వాతావరణం ఉండే సత్తుపల్లి ప్రాంతం ఇప్పుడు సింగరేణి బ్లాంబ్‌బ్లాస్టింగ్.. దుమ్మూధూళి వ్యాపించటంతో ప్రజలు అనారోగ్య సమస్యలతో అల్లాడుతున్నారు.**

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన కిష్టారం, రేజర్ల, కొత్తూరు, సత్తుపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు సింగరేణి కాలుష్యంతో శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులతో గ్రామస్తులు మృతి చెందుతున్న సంఘటన ఏటేటా ఎక్కువవుతున్నాయి. గత 14 సంవత్సరాల క్రితం ప్రశాంతంగా ఉన్న సత్తుపల్లి ప్రాంతంలోని ప్రజలు సింగరేణి బాంబ్‌బ్లాస్టింగ్ శబ్దాలు.. దాని ద్వారా వచ్చే దుమ్మూధూళితో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.

**పెరిగిన ఓసీలతో..**

గతంలో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ-1 మాత్రమే ఉండేది. తర్వాత జేవీఆర్ ఓసీ-2, కిష్టారం ఓసీలు రావటంతో గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. అదీకాక కిష్టారం గ్రామం అంబేడ్కర్‌నగర్, బీసీకాలనీలకు అతిసమీపంలోనే సైలోబంకర్‌ను ఏర్పాటు చేయటంతో కాలుష్యం మరింత తీవ్రరూపం దాల్చింది. సైలో బంకర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని.. లేకుంటే కాలనీల ప్రజలను ఖాళీ చేయించి మరోచోట పునరావాసం కల్పించాలని సింగరేణి అధికారులు, రాజకీయ పార్టీల నాయకులకు విన్నవించి.. ఆందోళనలు చేపట్టినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రావటం లేదు.

**ప్రయాణికుల అవస్థలు..**

సత్తుపల్లి నుంచి కిష్టారం వెళ్లాలంటే బొగ్గు లారీలు శరవేగంతో వెళ్తుండటంతో రోడ్డుపై ఉండే దుమ్మూధూళి, బొగ్గు పొడి ద్విచక్రవాహనదారుల కళ్లల్లో పడటంతో వాహనం ఎప్పుడు ప్రమాదానికి గురౌతుందోనని భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాజమాన్యం మొక్కుబడిగా నీళ్లు చల్లుతుందే తప్పా.. శాస్వత మార్గానికి చర్యలు చేపట్టడం లేదు. కనీసం బొగ్గు లోడుతో వెళ్తున్న లారీపై కూడా పరదాలు కప్పక పోవటంతో రోడ్డుపై బొగ్గు పెళ్లలు పడి.. అవి పగిలిపోయి లారీలు వేగానికి ఆ దుమ్ము కళ్లల్లో పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అదీగాక సింగరేణి కిష్టారం వై-జంక్షన్‌వద్ద రోడ్డుకు ఇరువైపులా లారీలు నిలిపి వేసి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**మధ్యాహ్నం వేళ్లలో..**

సత్తుపల్లి - రేజర్ల వెళ్లే మార్గంలో ప్రతిరోజు 3 గంటల నుంచి 3.30 గంటల ప్రాంతంలో సింగరేణి బాంబ్‌బ్లాస్టింగ్‌లు చేయటంతో దాని వచ్చే విపరీతమై పొగ, దుమ్మూధూళితో ఆ మార్గం గుండా వెళ్లే పరిస్థితి కన్పించటం లేదు. బ్లాస్టింగ్ చేసే అర గంట సమయంలో మాత్రమే అధికారులు ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు నిలిపేస్తున్నారు.

### రోగాల బారిన పడుతున్నాం..



సింగరేణి యాజమాన్యం బాంబు బ్లాస్టింగ్‌లతో గృహాలు శిథిలమైపోవడంతో పాటు రోగాల బారిన పడాల్సి వస్తుంది. ఇంకో అడుగు ముందుకేసి మా కాలనీ సమీపంలో సైలో బంకర్ నిర్మించి మా ప్రాణాలపై గురిపెట్టారు.

– పాలకుర్తి సుమలత, కిష్టారం

### మా బతుకులు మసిబారాయి..



మా ఊరు సింగరేణి రాకముందు పచ్చదనానికి పెట్టింది పేరు. దట్టమైన అడవులు, పచ్చని పైరు పంటలు, పాడి పంటలతో ఆరోగ్యకరమైన వాతావరణంలో బతికేవాళ్లం.. సింగరేణి రాకతో మా బ్రతుకులు మాసిబారిపోయాయి.

– సుశీల, అంబేడ్కర్‌నగర్, కిష్టారం

## రైతు సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'



మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: భూ సమస్యలు పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పున్నం చందర్ అన్నారు. గురువారం మండలంలోని బోనకల్, పెద్దబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. బోనకల్‌లో 58మంది రైతులు దరఖాస్తులు, పెద్దబీరవల్లిలో 156 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొదుపరచి, రైతుల దరఖాస్తులకు రసీదులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్, మైతిలీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ సేవలు విస్తృతపరచాలి



బహుమతులు అందిస్తున్న వీరభద్రస్వామి

మధిర: పోస్టల్ సేవలను ప్రజలకు చేరువయ్యేవిధంగా విస్తృతపరచాలని పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. గురువారం మధిర సబ్ పోస్టఆఫీస్‌లో మధిర పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వై.కోటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత వార్షిక సంవత్సరంలో అత్యుత్తమ పోస్టల్ సేవలు సేవలు అందించిన వారికి పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి బహుమతులు అందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తంతి తపాలా సేవలను, అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలని గ్రామీణ తపాలా సిబ్బందిని కోరారు. చిన్నపిల్లల వయసు నుంచి పెద్ద వయసు కలిగిన వారికి అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయని తెలిపారు. భారతదేశంలో అతి నమ్మకమైన వ్యవస్థ పోస్టఆఫీస్ మాత్రమేనని పేర్కొన్నారు.

## ప్రజలకు అవగాహన కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

కారేపల్లి: సైడ్ డ్రెయిన్లు లేని గ్రామాల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ శిరీష అన్నారు. గురువారం సింగరేణి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి.. ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, ఉపాధి హామీ సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేని గృహాల గుర్తింపు, ముంపు గ్రామాల గుర్తించి, పునరావాస శిబిరాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలుపై సమీక్ష నిర్వహించారు.

## పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు

సత్తుపల్లి: తలసేమియా రహిత తెలంగాణ కోసం అందరు కృషి చేయాలని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు అన్నారు. యువభారత్‌శ శక్తి ఆధ్వర్యాన ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం తలసేమియా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కామెర్ల క్రాంతికుమార్, రమేష్, కాలినేని రాజేష్ పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి తిరునాళ్లు ప్రారంభం



పెద్దమ్మతల్లి ఊరేగింపులో భక్తులు

సత్తుపల్లిటౌన్: అయ్యగారిపేట నాయకపోడు గిరిజనుల పెద్దమ్మతల్లి తిరునాళ్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అయ్యగారిపేట అంబేద్కర్‌నగర్ ప్రాంతాలలో ఇంటింటా ఊరేగింపు నిర్వహించి పూజలు చేశారు.

## సోలార్ వెలుగులు



ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్లు

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణ సోలార్ లైట్ల వెలుగులతో కళకళలాడుతుంది. ఇటీవల ఆస్పత్రిలో కరెంట్‌లేక అంధకారంలో ఉండగా.. విషయాన్ని ఓ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె సింగరేణి సంస్థ అధికారులతో మాట్లాడి.. ఆస్పత్రిలో లైట్లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దీంతో సింగరేణి యాజమాన్యం మరియు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్‌వీఆర్ ప్రహ్లాద్ సహకారంతో ఆరు ఎల్ఈడీ లైట్లు ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేశారు.

## సింగపూర్ కంపెనీతో మిస్ట్ కళాశాల ఎంఓయూ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మిస్ట్ కళాశాల సింగపూర్‌కు చెందిన హిమోటిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఎంఓయూ చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ గురువారం తెలిపారు. రెండేళ్లపాటు బీటెక్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఇంటర్నేషనల్ ఇంటెన్సివ్ ప్లేస్‌మెంట్ పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు.

## వేతనం సక్రమంగా ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్: వేసవి దృష్ట్యా ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలందరికీ పని కల్పించి రూ.307 వేతనాన్ని సక్రమంగా అందించాలని ఉపాధిహామీ ఏపీడీ చలపతి తెలిపారు. గురువారం సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100శాతం ఇంకుడు గుంతలు నిర్మించి, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అంతకు ముందు కిష్టారంలోని పని జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీపీఓ సక్రియ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీఓ కృష్ణలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధిహామీ ఏపీడీ చలపతి

## ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తాళ్లూరి కృష్ణ, కొత్త లక్ష్మి, చిలక మంగమ్మ, నాగమణి, శంకర్, అశోక్, బసిరెడ్డి, నీలాబాయి పాల్గొన్నారు.

## ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూనే అందాల పోటీలా ?



మాట్లాడుతున్న ఉమావతి

కారేపల్లి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూనే అందాల పోటీలు నిర్వహిస్తారా అంటూ ఐద్వా మండల అధ్యక్షురాలు కొండెబోయిన ఉమావతి అన్నారు. గురువారం కారేపల్లిలో జరిగిన మండల ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడారు. పెట్టుబడిదారులు తమ స్వలాభాల కోసం అందాల పోటీలు నిర్వహిస్తూ, మహిళలను ఆటబొమ్మలుగా చేస్తున్నారన్నారు. తక్షణమే అందాల పోటీలను రద్దు చేసి, సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి పైన దృష్టి పెట్టాలని ఆమె వివరించారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు సూరపాక ధనమ్మ, కొమ్ము లలిత, లక్ష్మి, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**● రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత..**



చెక్కు అందిస్తున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి సత్తుపల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును గురువారం అందించారు. సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన కుంజా రాఘవులు(47) గత ఏడాది నవంబర్27వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి సత్తుపల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.1,000లతో రూ.20 లక్షల ప్రమాద బీమా ఉండటంతో అతని భార్య లక్ష్మికి గురువారం మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ టీవీఎస్ రామలింగేశ్వరరావు బీమా చెక్కు అందించారు. కార్యక్రమంలో బీడీఎం బి.రాజా, బొమ్మారెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**● సంస్మరణ సభను జయప్రదం చేయండి**



మధుసూధనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: ఈ నెల 11న మండలంలోని లాలాపురంలో నిర్వహించే సీపీఎం సీనియర్ నాయకుడు సంక్రాంతి మధుసూధనరావు సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కొణిజర్లలో మోత్కూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మధుసూధనరావు చిత్రపటానికి నాయకులు పూల మాలలేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయ్య, కుటుంబరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, హరిచంద్, అఫ్జల్, చిన దానయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

**● కేటీఆర్ పర్యటనను..**

కొణిజర్ల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు (కేటీఆర్) తల్లాడ మండల పర్యటనలో కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పోట్ల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పోట్ల కవిత పిలుపునిచ్చారు. తల్లాడ మండలం మిట్టపల్లి డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణలో పాల్గొని, సభలో ప్రసంగిస్తారని కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు.

**● కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**



కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న తహసీల్దార్ కూరపాటి అనంతరాజు

చింతకాని: మండలంలోని 44మందికి మంజూరైన రూ.44,05,104 కల్యాణలక్ష్మి చెక్కులను గురువారం తహసీల్దార్ అనంతరాజు లబ్ధిదారులకు తహసీల్‌లో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు కిషోర్, గోపి, గోవిందరావు, వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**● మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ**

కల్లూరు: రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అభిమానులు కల్లూరు నూతన బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్, మైబు, బాజీ, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా లింగాలకు చెందిన మద్దినేని లోకేష్, సుభద్ర దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారి కుమారుడు వంశీ, కుమార్తె నవ్యశ్రీ బస్టాండ్‌లో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

**● సాయినాథుడికి ప్రత్యేక పూజలు**



ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి గురువారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, కర్పూర హారతులిచ్చి పూజలు చేశారు. భక్తులు బాబాని దర్శించుకొగా.. అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. మండలకేంద్రంలోని సాయినాథుని ఆలయంలో పెద్దాపురం గ్రామానికి చెందిన బత్తుల జమలయ్య – నాగమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

**● ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం**

మధిర: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మధిర ట్యాంక్ బండ్ వద్ద ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత సైన్యం ప్రతిష్టాత్మంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి జంగా నరసింహారెడ్డి, లింగంపల్లి అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు, ప్రసాద్ రావు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## వర్షపు నీటితో జలకళ



మధిర - తిరువూరు రోడ్డు పక్కన ప్రవహిస్తున్న వర్షపు నీరు

మధిర: మండలంలోని మాటూరు, ఖాజీపురం తదితర గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. పెద్ద వర్షం కావడంతో మధిర – తిరువూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కందకాల నుంచి వర్షపు నీరు ప్రవహించింది. ఇటీవల కాలంలో అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు భూమిలో తేమ ఉండడంతో గురువారం కురిసిన వర్షానికి పొలాల్లో ఉన్న నీరు బయటకు వచ్చి కాలువల్లోకి చేరుకొని జలకళ సంతరించుకుంది. దీనిని చూసిన వారంతా వానాకాలం ఈ ఏడాది ముందే వచ్చినట్లుగా ఉందని చర్చించుకుంటున్నారు. తొలకరి జల్లుల మాదిరిగా వర్షం రావడంతో కాలం చల్లబడినట్లుగా ఉందని భావిస్తున్నారు.

# ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

- నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా పంటల సాగు
- అందుబాటులో విత్తనాలు



వేసవి దుక్కి దున్నుతున్న రైతు

వైరా: వానాకాలం సీజన్‌కు సంబంధించిన పంటల ప్రణాళిక నియోజకవర్గంలో వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో ప్రధానంగా వరి మొక్కజొన్న, పత్తి, మిర్చి, చెరుకు పంటలతో పాటు పెసర వంటి అపరాల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌సాగు విస్తీర్ణం కొంత మేర పెరగనుందని అధికారుల అంచనా.. తొలకరి చినుకు పడగానే రైతులు జూన్ మొదటి వారం నుంచి సాగు పనులు ప్రారంభించనున్నారు. వరి తర్వాత నియోజకవర్గంలో పత్తి, మొక్కజొన్న, మిర్చి సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

**వైరా రిజర్వాయర్ కిందే అధికంగా..**

పంటల సాగు వైరా రిజర్వాయర్ ఆయకట్టు కింద ఖరీఫ్‌లో అధికారికంగా 17 వేలకు పైగా ఎకరాల్లో వరిసాగు అయ్యే అవకాశం ఉండగా మరో 5వేలు అనధికారికంగా రిజర్వాయర్ ఆయకట్టు కింద సాగులోకి రానున్నది. ఇప్పటికే రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల పరిధిలోని ఆధునీకీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జూన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**విత్తనాలు, ఎరువులు సిద్ధం..**

నియోజకవర్గంలో 37,024 ఎకరాల్లో వరి, 1,000 ఎకరాల్లో మొక్కజొన్న, 55వేల ఎకరాలకు పైగా పత్తి, 100 ఎకరాల్లో చెరకు, 7,500 ఎకరాల్లో పెసర, 120 ఎకరాల్లో కంది, సాగులోకి రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. ఆయా పంటలకు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులు, సిద్ధంగా అందుబాటులో ఉంచినట్లు త్వరలో రైతులకు సరిపడా దిగుమతి చేస్తామని పేర్కొన్నారు.

### ఇబ్బందులు లేకుండా చూస్తాం..



ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయి. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. గ్రామాలలో ఏఈఓలు సలహాలు సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

– తుమ్మలపల్లి కరుణశ్రీ , ఏడీఏ, వైరా